క్లుప్తంగా

గ్రామ దేవతలకు జలాభిషేకం



బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉన్న గోదావరి నుంచి కాలి నడకన గంగనీటిని తీసుకొచ్చి వల గొడుగు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. గ్రామంలోని ముత్యాలమ్మ, వెంకటేశ్వరుని, హనుమాన్, పోచమ్మ, తాతాయి ఆలయాల్లో నీటితో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోధన్‌టౌన్: పట్టణంలోని రెడ్డికా, ముదిరాజ్, మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కులసంఘాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డికా సంఘం జిల్లా అడహక్‌కమిటీ అధ్యక్షుడు గుమ్మల అశోక్‌రెడ్డి, పెద్దకాపు సాయిలు, ఉద్మీర్ లక్ష్మణ్, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో బీజేపీ రచ్చబండ



వేల్పూర్: మండలంలోని పోచంపల్లిలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు బెల్దారి నవీన్ ఆధ్వర్యంలో బీజేపీ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు భానుచందర్, శేఖర్, మోహన్, ముత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్ సమావేశంలో మాక్లూర్ నేతలు



మాక్లూర్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో గాంధీభవన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి మాక్లూర్ మండల నేతలు హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక సమావేశం జరిగినట్లు పార్టీ మండల నేతలు బూరోళ్ల అశోక్, బి దయాకర్‌రావు తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కావడానికి, వచ్చే ఎన్నికల్లో గెలుపు అంశాలపై చర్చించినట్లు వారు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నందిపేట్: మండలం కేంద్రంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, దమ్మాయి శ్రీను, ఐసూబ్, జమీల్, హైమద్, పీరాజీ నాగరాజ్, కళా భోజన్న, కదిర్, కాంతం చిన్నయ్య, అప్జల్, తిమ్మల శివ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ టాపర్‌కు ఎమ్మెల్యే సన్మానం



వేల్పూర్: ఎస్సెస్సీలో టాపర్‌గా నిలిచిన వేల్పూర్ మండలం మోతె గ్రామానికి చెందిన సోన్నాయిల శ్రీనిధిని ఆదివారం వేల్పూర్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ఆమెతో పాటు స్కూల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన మూడ్ శివన్విత, పెంజర్ల నవనీత లను కూడా సన్మానించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో మోతె మాజీ ఎంపీటీసీ దొల్ల రాజేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం వైద్య గణేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైడి నాగధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నత్తకు నడక నేర్పేలా..!

- నెమ్మదిగా సాగుతున్న ముప్కాల్ అండర్ వే బ్రిడ్జి పనులు
- వర్షాకాలంలో మరింత మందగించే అవకాశం
- కొత్తపల్లి రోడ్డు నుంచి ట్రాఫిక్ మళ్లింపు



కొనసాగుతున్న అండర్ వే బ్రిడ్జి పనులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి బైపాస్ వద్ద నిర్మిస్తున్న అండర్ వే బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పేలా ఉన్నాయి. జాతీయ రహదారి జంక్షన్ వద్ద అండర్ వే బ్రిడ్జి లేక పోవడంతో తరచూగా ప్రమాదాలు సంభించేవి. దీంతో గత 9 నెలల క్రితం అండర్ వే బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. నాటి నుంచి బ్రిడ్జి నిర్మాణ జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్లను, మురికి కాలువల పనులను చేపట్టారు. రెండు నెలల క్రితం వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇప్పటి వరకు మట్టి తవ్వకాల పనులు పూర్తి చేసి, సైడ్ వాల్ స్టీల్ పనులు కొనసాగుతున్నాయి. అండర్ వే బ్రిడ్జి నిర్మాణ పనులు, మంజూరైన నిధుల వివరాలను నేషనల్ హైవే అథారిటీ అధికారులు వెల్లడించడం లేదు. నిధులు మంజూరై తొమ్మిది నెలలు గడుస్తున్నా పనులు నెమ్మదిగా కొనసాగుతుండడంతపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అండర్ వే బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మెండోరా మండల కేంద్రానికి, ముప్కాల్ మండలంలోని పలు గ్రామాల ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణం సాగుతుంది.

కొనసాగుతన్న అండర్ వే బ్రిడ్జి నిర్మాణ పనులు వర్షాకాలంతో మరింత మందగించే అవకాశం ఉంది. గత పది రోజుల నుంచి వర్షాలు లేకున్నా పనులను వేగవంతం చేయడం లేదు. మళ్లీ వర్షాలు ప్రారంభమైతే పనులు ముందుకు సాగడం ఇబ్బందిగా ఉంటుంది. దీంతో పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. వానలు ఎక్కువ వచ్చే లోపు ఓ స్థాయి వరకు పనులు పూర్తి చేస్తే ఇతర పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

జాతీయ రహదారి జంక్షన్ నుంచి ముప్కాల్ మండల కేంద్రం లోపలికి వెళ్లకుండా ట్రాఫిక్‌ను మండలంలోని కొత్తపల్లి శివారున ఉన్న సర్వీస్ రోడ్డు నుంచి ముప్కాల్ మండల కేంద్రం లోపలికి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. నిర్మల్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ప్రయివేటు వాహనాలు ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగానే ఉంటుంది. పనులు పూర్తయ్యే వరకు ఇబ్బందులు తప్పేలా లేవని అధికారులు అంటున్నారు.

పనులను వేగంగా చేపట్టాలి

అండర్ వే బ్రిడ్జి పనులను వేగంగా చేపట్టాలి. పనులు చేపడుతుండటంతో ట్రాఫిక్‌ను మళ్లీస్తున్నారు. దీంతో మండల కేంద్రంలో బైక్‌లపై వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. మూడు నెలలుగా కొత్తపల్లి నుంచి తిరిగి వెళ్తున్నాం.

– రాంరాజ్, ప్రయాణికుడు

నేటి చిత్రం



నీటి గుంత.. ఎప్పుడు తీరేనో చింత


నందిపేట్: మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహ సమీపంలో బజార్ కొత్తూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై నిలుస్తున్న నీటి గుంతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రయాణికులతో పాటు చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు బురద నీటితో ఇబ్బంది పడుతున్నారు. స్పందించాల్సిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. – మాదస్తు శేఖర్, రాజనగర్, నందిపేట

మాకు ఫొటో పంపండి — మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

సుదర్శన్‌రెడ్డి మంత్రి అవుతారు

- పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



బోధన్‌టౌన్: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి భవిష్యత్తులో మంత్రి పదవి వస్తుందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి బోధన్ లో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. ఇరిగేషన్ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బోధన్ లోని మధుమలాంచ కళాశాలలో విద్యాభ్యాసం చేశానని, ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదల, రైతుల సంక్షేమం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు కొత్త పథకాలను అమలులోకి తీసుకొచ్చి సమర్థవంతంగా పేదలకు అందేలా చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. పేద ప్రజలు ఈ పథకాలను వినియోగించుకుని వారి జీవితాలను బాగు చేసుకోవాలని సూచించారు. ఆదివారం మోర్తాడ్‌లోని ప్రజా నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిపొందే వారికి అతి తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇతరులకు కూడా తక్కువ ధరకు ఇసుక అందుతుండటంతో నిర్మాణ వ్యయం తగ్గిందన్నారు. రైతు భరోసా కింద వర్షాకాలం పంటల సాగు ఆరంభమైన వారం రోజులలోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమచేసిన ప్రభుత్వం తమదేనని అన్నారు. ఇలా ఎన్నో పథకాలు పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్నామని తెలిపారు. పథకాలు రాని వారు ఉంటే తమ పార్టీ కార్యకర్తలు, నాయకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లిలో ఉన్న సీఎస్ఐ చర్చి కమిటీ ప్రతినిధుల ఎన్నిక ఆదివారం చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ప్రతినిధులుగా దమ్మల జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, రాజేశ్, బెనహర్, సునితా డేవిడ్ ఎన్నికయ్యారు. ఈ కమిటీ మూడేళ్ల కొనసాగుతుందని, చర్చి అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ ప్రతినిధి జ్యోతిరాజ్ తెలిపారు.

దోమలపై యుద్ధానికి సన్నద్ధం

- అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు



తొట్టిలోని నీటిని పరిశీలిస్తున్న వైద్య శాఖ సిబ్బంది

కమ్మర్‌పల్లి: గ్రామాల్లో విషజ్వరాలు, డయేరియా ప్రబలుతుండటంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దోమల నివారణపై దృష్టి సారిస్తోంది. చాలామంది జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలతో పాటు, డయేరియా బారిన పడి ఆస్పత్రుల వైపు పరుగెడుతున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు జోరు కాక ముందే చక్కదిద్దేందుకు జిల్లా అధికారులు యత్నిస్తున్నారు. ఈ మేరకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, హెల్త్ సబ్ సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు మండల వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించడంతో పాటు, విద్యా సంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు హెల్త్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి..

వర్షాకాలంలో మలేరియా, డెంగీ, డయేరియా, ఇతర విషయ జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డే కార్యక్రమాల్లో భాగంగా ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి నీటి తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా మట్టి పోసి పూడ్చేస్తున్నారు. పాత కూలర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు, గాజు, మట్టి పాత్రలను గుర్తించి అందులో ఉన్న నీటిని తొలగించాలని సూచిస్తున్నారు. క్రిమి కీటకాలను అరికట్టేందుకు డ్రైయినేజీల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్స్, ఇతర వ్యర్థాలు పడేయ్యొద్దని వివరిస్తున్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు దోమలకు ఆవాసాలుగా మారే ప్రమాదం పొంచి ఉందని తెలియజేస్తున్నారు.

చర్యలు చేపడుతున్నాం



వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నాం. ఆశావర్కర్లతో పాటు, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డేలో భాగంగా ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని గుర్తించి తొలగింపజేయాలని సూచిస్తున్నాం.

– స్పందన, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, చౌట్‌పల్లి

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ఆర్మూర్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాలు ఇందుకు నిదర్శనమని శ్రీ జ్ఞానసరస్వతి దేవస్థానం అధ్యక్షుడు ఎల్లోల్ల సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని శాస్త్రీనగర్‌లోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో 9 వారాలుగా పట్టణంలోని పలు ఆలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, జంగిడి భోజన్న, గణేశ్, కొత్తూరు రాజయ్య, గుర్రం రాకేశ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లపై గుంతలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కృష్ణానగర్ వద్ద బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మాక్లూర్: మండల పరిధిలోని ఆయా గ్రామాల బీటీ రోడ్లు గుంతల మయంతో దర్శనమిస్తున్నాయి. మండలంలోని కల్లెడి, చిన్నాపూర్, బొంకన్‌పల్లి, కృష్ణనగర్, రాంపూర్, గంగరమంద, గొట్టిముక్కల, ధీకంపల్లి, రాంచంద్రాపల్లిలో ఉన్న బీటీ రోడ్లకు రెండేళ్ల క్రితం మరమ్మతులు చేపట్టారు. కానీ పనులు చేపట్టిన ఏడాది కాకముందే రోడ్లు గుంతల మయం కావడతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రోడ్ల మరమ్మతుల పనులకు రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేపడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

హామీల అమలుకు ప్రభుత్వాలను నిలదీయాలి



బోధన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు కోసం కష్టజీవులంతా ఒక్కటై నిలదీయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో పార్టీ అనుబంధ ప్రజా సంఘాల్లో గ్రామస్తులు, మహిళలు చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నాయని అన్నారు. పార్టీ ఏరియా కార్యదర్శి శంకర్‌గౌడ్, యేశాల గంగాధర్, గైని రాములు, జయమ్మ, గంగామణి, గౌతం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



నందిపేట్: మండల సమీపంలో ఉన్న శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ హాస్పిటల్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన కంటి శిబిరంలో వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. పరీక్షల్లో కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త రఫీక్ తమ్ముడు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. పది వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, నాయకులు నర్సారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బంజారాల ఐక్యతకు కమిటీలు పనిచేయాలి



నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందిస్తున్న రాష్ట్ర నాయకులు

రెంజల్: బంజారాల ఐక్యతకు నూతనంగా ఏర్పాటైన కమిటీలు పనిచేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకుడు నేనావత్ శ్రీహరి నాయక్ సూచించారు. ఆదివారం మండలంలోని దండిగుట్ట గ్రామంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కమిటీలు ముందుండాలని పేర్కొన్నారు. మండల కమిటీలను పూర్తి చేసి త్వరలో జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. మండల అధ్యక్షుడిగా జాదవ్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా చరణ్‌సింగ్, కోశాధికారిగా భూక్యా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా దస్సింగ్‌నాయక్, అశోక్, సంయుక్త కార్యదర్శులుగా జాదవ్ సురేశ్, బానోత్ రవి, జాదవ్ జీవేందర్‌ల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జాన్ వెస్లీకి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న పాస్టర్, క్రైస్తవులు

పెర్కిట్: ఆర్మూర్ మండలం పిప్రిలోని ఎల్ షద్దాయి చర్చిలో ఆదివారం క్రీస్తు రత్న డాక్టర్ జాన్ వెస్లీకి ఘన నివాళులర్పించారు. పాస్టర్ జీ శేఖర్ ఇడ్విన్ మాట్లాడుతూ.. తెలంగాణలోని పలు జిల్లాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆధ్యాత్మిక మార్గంలో నడిపించిన జాన్ వెస్లీ మరణం తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు జలందర్, చందు, ప్రాన్సిస్, స్టీవెన్ రాజ్, ప్రవీణ్, భోజేందర్, శ్యామ్, చిన్ని, అనిల్, ప్రభుకుమార్, సన్నీ, నితిన్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలి.. అధ్వానంగా మారి..

- నందిపేటలో సీసీ రోడ్ల దుస్థితి
- నాసిరకం పనులతో దెబ్బతిన్న రోడ్లు



నందిపేట బస్‌డిపో దారిలో కంకర తేలిన సీసీ రోడ్డు

నందిపేట్: మండల కేంద్రంలో వేసిన సీసీ రోడ్లు నాణ్యత లోపం కారణంగా కంకర తేలి అధ్వానంగా మారాయి. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్వహించడం, అధికారుల పర్యవేక్షణ లోపంతో నాసిరకం రోడ్లు వేశారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై కంకర తేలడంతో పాటు గుంతలు ఏర్పడడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ. నాలుగు కోట్ల నిధులు

నందిపేటలో ఈజీఎస్ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. నాలుగు కోట్ల నిధులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా గత ప్రభుత్వ హయాంలో 20 శాతం మించి పనులు జరుగలేదు. చాలా రోజుల పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆశావాహులు మూడు నెలల క్రితం నందిపేటలో సీసీ రోడ్లు వేసేందుకు ముందుకొచ్చారు. కాలనీలను పంచుకుని తమకు నచ్చిన కాంట్రాక్టర్ల ద్వారా సీసీ రోడ్లు వేయించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మండల కేంద్రంలోని రాజానగర్, రామ్‌నగర్, పాతూర్, హన్మాన్‌గల్లిలతో పాటు పలు కాలనీలలో మూడు నెలల క్రితం సీసీ రోడ్లు నిర్మించారు. సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు రోడ్లు కంకర తేలి గుంతలుగా ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లు ఇలా ఉంటే పెద్ద వర్షాలకు ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం

నందిపేటలో సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని మా దృష్టికి వచ్చింది. సీసీ రోడ్డు పనుల కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని మళ్లీ రోడ్డు వేయిస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో, నందిపేట